



స్వర్ణ అశ్వ వాహనంలో వైగైనదిలో ప్రవేశించిన కళ్లలగర్

కళ్లలగర్ ఆగమనంతో పులకించిన మదురై

● వైగై నదిలో స్వర్ణ అశ్వవాహనంపై సవారీ

● ఆండాళ్ మాలతో అపూర్వదర్శనం

టి.నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): చిత్తిరై బ్రహ్మోత్సవాల్లో భాగంగా అళగర్‌మలై నుంచి కళ్లలగర్ వేషంలో సుందరరాజపెరుమాళ్ సోమవారం వేకువజాము మదురై వైగైనదీ ప్రాంతానికి చేరుకున్నారు. కండాంగి పట్టువసాలు ధరించి, చెర్నాకోల, పొన్నుకర్ర పట్టుకుని స్వర్ణపల్లకీలో బయలుదేరి, ఆదివారం మదురై నగర సరిహద్దు ప్రాంతమైన మూండ్రుమావడి వద్ద భక్తుల ఘనస్వాగత సత్కారాలందుకున్న సుందరరాజ పెరుమాళ్ సోమవారం వైగైనదీ ప్రాంతానికి చేరుకున్నారు. పట్టువస్త్రం, స్వర్ణాభరణాలతో, శ్రీవిల్లిపుత్తూరు నుంచి వచ్చిన ఆండాళ్ శూడికొడుత్త మాలను ధరించి స్వర్ణ అశ్వారూఢులై మదురై నగరానికి వేంచేసిన కళ్లలగర్ స్వామి సూర్యోదయ సమయంలో స్వర్ణకాంతులు వెదజల్లుతుండగా మంగళవాయిద్యాలు, చండీమేళాల వాయిద్యాల నడుమ లక్షలాదిమంది భక్తులు తిలకిస్తుండగా వైగైనదీలోకి ప్రవేశించారు. కళ్ళలగర్ వైగైనదీ ప్రవేశ వైభవోత్సవానికి దేశవిదేశాల నుండి తరలివచ్చిన లక్షలాది మంది భక్తులతో మదురై నగరం నిండిపోయింది. కళ్లలగర్ స్వామి ఊరేగింపుగా వచ్చిన ప్రధాన వీధుల్లో ఆ స్వామివారిని ఆహ్వానిస్తూ ఇళ్ళల్లో మామిడి తోరణాలు, వీధుల్లో రంగవల్లులు, ప్రధాన కూడళ్లలో అరటిచెట్లతో, కొబ్బరి ఆకులతో స్వాగత తోరణాలు కట్టి మదురై నగరవాసులు ఆ స్వామివారిపై తమకున్న భక్తిని చాటుకున్నారు. కళ్లలగర్ ఆగమనానికి రెండు రోజులకు ముందే ఆ స్వామిని ఆహ్వానించేందుకు మదురైవాసులంతా అన్ని ఏర్పాట్లు చేపట్టారు. ఇంతటి పకడ్బందీ ఏర్పాట్ల మధ్య కళ్లలగర్ స్వామివారు మదురై నగరంలో వేంచేసి, వైగై నదీలోకి ప్రవేశించారు.

నేడు దశావతారాల దర్శనం...

మంగళవారం వేకువజాము వీరరాఘవ పెరుమాళ్ ఆలయంలో కళ్లలగర్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకు తిరుమంజనం అనంతరం స్వామివారు శేషవాహనంపై వండియూరు నుంచి తెన్నూరు క్షేత్రానికి బయలుదేరనున్నారు. ఉదయం 11.30 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు తెన్నూరు మండపంలో భక్తులకు దర్శనమిస్తారు. తిరుమంజనం తదితర సేవల తర్వాత గరుడవాహనంపె మండూక మహర్షికి మోక్షాన్ని ప్రసాదించే ఘట్టం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3.30 నుండి సాయంత్రం 4 గంటల వరకు అరుళ్‌మిగు హనుమర్ కోవిల్ (ఆంజనేయస్వామి ఆలయం)లో వేంచేస్తారు. రాత్రి 10 గంటలకు రామరాయర్ మండపంలో తిరుమంజన సేవలు పూర్తయిన తర్వాత స్వామివారు దశావతారాల అలంకరణలతో భక్తులను బుధవారం వేకువజాము వరకు పరవశింపజేయనున్నారు.

ఆగమనోత్సవం....

సోమవారం వేకువజాము 2.30 గంటలకు తల్లాకుళం కరుప్పణ్ణస్వామికి ఆలయానికి చేరుకున్న కళ్లలగర్ స్వామి గంటసేపు ఆ ఆలయంలోనే భక్తులకు దర్శనమిచ్చారు. స్వర్ణ అశ్వంపై ఆశీనులై ఆయిరమ్ పొన్ (వేయి స్వర్ణాల) సప్పరంలో వేంచేశారు. ఆ తర్వాత వేకువజాము మూడు గంటలకు వైగై నది వైపు బయలుదేరారు. ఉదయం 605 గంటల్లోగా కళ్లలగర్ స్వామి స్వర్ణ అశ్వవాహనారూఢులై వైగై నదిలోకి వేంచేశారు. అంతకు ముందే ఆ ప్రాంతానికి విచ్చేసిన వండియూరు వీరరాఘవ పెరుమాళ్ కళ్లలగర్ స్వామివారిని వైగై నదీ ఆగమనోత్సవానికి ఆహ్వానించారు. కళ్లలగర్ వైగైనదీలో వేంచేసే దృశ్యాన్ని చూసేందుకు లక్షమందికి పైగా భక్తులు నది ప్రాంతంలో గుమిగూడారు. ఈ యేడాది పంటలు సమృద్ధిగా పండుతాయని సూచించేలా ఆకు పచ్చ మేలిమి పట్టు వస్త్రాన్ని ధరించి కళ్లలగర్ స్వామి వైగై నదిలో వేంచేయగానే 'గోవిందా... గోవిందా... కళ్లలగర్ స్వామియే శరణం' అంటూ భక్తులు చేసిన నినాదాలతో ఆ నదీ ప్రాంతం ప్రతిధ్వనించింది. కళ్లలగర్ వైగైనదీ ఆగమన వైభవోత్సవాన్ని తిలకించేందుకు మదురై, దిండుగల్, శివగంగ, విరుదునగర్, రామనాధపురం, తేని తదితర జిల్లాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాలైన కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరి నుంచి కూడా భక్తులు రెండు రోజులకు ముందే మదురై నగరానికి చేరుకున్నారు. ఆదివారం రాత్రే వైగైనదీ ప్రాంతం భక్తులతో నిండిపోయింది. కోర్టు నిబంధనల ప్రకారం వైగైనదీ జలాలను కళ్లలగర్ స్వామిపై, భక్తులపై కుమ్మరించకుండా తీర్థజలాలను చల్లినట్లు నదీ జలాలను ఒకరిపై ఒకరు చల్లుకున్నారు. సుమారు గంటకు పైగా కళ్ళలగర్ స్వామి స్వర్ణ అశ్వవాహనంపై వైగైనదీ నలువైపులా ఊరేగారు. ఈ వేడుకలను పురస్కరించుకుని వెగైనదీ సమీప ప్రాంతాల్లో పలు చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేసి మజ్జిగ, పానకం, శీతలపానీయాలను పంపిణీ చేశారు. ఇదే విధంగా శైవ, వైష్ణవ భక్తజన సంఘాల సమాఖ్యల ఆధ్వర్యంలో ఉచితాన్నదాన కార్యక్రమాలు కూడా జరిగాయి. అనంతరం కళ్లలగర్ స్వామి మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు రామరాయర్ మండపంలో వేంచేయగా తీర్థవారీ నిర్వహించారు. రాత్రి 9 గంటలకు వండియూరు వీరరాఘవ పెరుమాళ్ ఆలయంలో కళ్లలగర్ స్వామి వేంచేశారు. అక్కడ స్వామివారికి తిరుమంజనం, సైతోపచారం, ఏకాంత సేవలు జరిగాయి.

అపూర్వ స్వాగతం...

శనివారం సాయంత్రం అళగర్‌మలై నుండి బయలుదేరిన కళ్లలగర్ స్వామివారు పొయ్‌క్కారపట్టి, కళ్ళత్రి, అప్పన్‌తిరుప్పది, కడచ్చనేందల్ ప్రాంతాల్లో ఉన్న మండపాల్లో వేంచేసి ఆదివారం ఉదయం ఆరుగంటలకు మదురై సమీపం మూండ్రుమావడి ప్రాంతానికి చేరారు. అక్కడ కళ్లలగర్‌ను స్వాగతిస్తూ మదురై నగర ప్రముఖులు, వివిధ ఆలయాల నిర్వాహకులు, ప్రధానార్చకులు, శైవ, వైష్ణవ పండితులంతా కలిసి ఎదురుసేవ నిర్వహించారు. అళగర్ వేషాలు ధరించిన భక్తులు నీటిని చిలకరిస్తూ కళ్లలగర్‌ను వర్ణిస్తూ పాడుతూ నృత్యం చేశారు. తర్వాత అళగర్‌స్వామి అక్కడి నుండి బయలుదేరి పుదూరు, డీఆర్వో కాలనీ, రిజర్వ్‌లైన్, రేస్‌కోర్సు, అవుడపేట మీదుగా దారి పొడవునా శైవ, వైష్ణవాలయాల నిర్వాహకులు ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపాల్లో సేదతీరుతూ భక్తులను అనుగ్రహించారు. నగరంలో కళ్ళలగర్‌స్వామిని ఆహ్వానిస్తూ తాటాకుల పర్ణశాలలు, భక్తులకు చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. రాత్రి పది గంటల ప్రాంతంలో తల్లాకుళం ప్రసన్న వెంకటాచలపతి ఆలయానికి కళ్లలగర్ స్వామి వేంచేశారు. అర్ధరాత్రి తిరుమంజనం అనంతరం ఆకుపచ్చరంగు పట్టు వస్త్రాలు ధరించి, స్వర్ణ అశ్వవాహనంలో వేంచేసి, శ్రీవిల్లిపుత్తూరు నుండి ఆండాళ్‌దేవి ధరించి ఇచ్చిన (శూడికొడుత్త) పుష్పమాలను ధరించారు.



భక్తజనసంద్రంగా మారిన వైగై నది

సేలంలో వృద్ధదంపతుల దారుణహత్య

● ఉత్తరాది యువకుడి అరెస్టు

చెన్నై, మే 12 (ఆంధ్రజ్యోతి): నగల కోసం వృద్ధ దంపతులను దారుణంగా హతమార్చిన ఉత్తరాది యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. సేలం సమీపం జాకీర్ అమ్మాపాళయంలో ఎట్టికుట్టై వీధిలో భాస్కరన్ (70) ఆయన భార్య విద్య (65) ఓ ఇంటిలో ముప్పై యేళ్లుగా నివసిస్తున్నారు. ఇంటి ముందుభాగంలో కిరాణా సరకుల దుకాణాన్ని నడుపుతున్నారు. వీరికి రామనాథన్ అలియాస్ దినేష్, వాసుదేవన్ అలియాస్ ఆనంద్ అనే ఇద్దరు కుమారులున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం ఆ వృద్ధ దంపతులు ఇంటిలో ఒంటరిగా ఉండడం గమనించి గుర్తు తెలియని యువకుడు చొరబడ్డాడు. ఆ దంపతులు భోజనం చేస్తుండగా ఆ యువకుడు సమ్మెట, గునపంతో వారిపై దాడి జరిపాడు. ఇద్దరూ నేలపై పడిపోవడంతో ఆ దుండగుడు విద్య ధరించిన పది సవర్ల బంగారు నగలను దోచుకెళ్ళాడు. ఈ సంఘటనలో విద్యా అక్కడికక్కడే మృతిచెందింది. భాస్కరన్ కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుండగా, కాసేపటికి ఇంటికి వెళ్ళిన వాసుదేవన్ తీవ్రగాయాలతో రక్తపు మడుగులో పడి ఉన్న తల్లిదండ్రులను చూసి తీవ్ర దిగ్భ్రాంతి చెందాడు. కొన ఊపిరితో ఉన్న తండ్రిని స్థానికుల సహాయంతో ఆస్పత్రికి తీసుకెళ్లాడు. వైద్యులు పరీక్షించి అప్పటికే ఆయన మృతిచెందినట్లు ప్రకటించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని ఆ ప్రాంతంలో ఉన్న సీసీ ఫుటేజీ ఆధారంగా ఆ ప్రాంతంలోని నివసిస్తున్న బిహార్‌కు చెందిన యువకుడు సంతోష్‌గా గుర్తించారు. వెంటనే ప్రత్యేక పోలీసుల దళం అతడి ఆచూకీ కోసం గాలించింది.. సేలం బస్ స్టేషన్, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో పోలీసులు నిఘా వేశారు. అదే సమయంలో సంతోష్ నివాసం వద్ద కూడా మఫ్టీలో మాటువేశారు. రాత్రి 7.30 గంటలకు రక్తపు మరకలున్న చొక్కాతో ఇంటికి వస్తున్న సంతోష్‌ను పోలీసులు చుట్టుముట్టి అరెస్టు చేశారు. అతడి నుంచి దోపిడీచేసిన 10 సవర్ల నగలను స్వాధీనం చేసుకున్నారు



హత్యకు గురైన దంపతులు (ఫైల్‌ఫొటో)





తరమణిలోని సమాచారశాఖ 'తమిళరసు' కార్యాలయంలో దివంగత ముఖ్యమంత్రి కరుణానిధి విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, తమిళ అభివృద్ధి, సమాచారశాఖ మంత్రి స్వామినాథన్, మేయర్ ఆర్.ప్రియ తదితరులు

చెన్నైలో వ్యాపిస్తున్న వైరల్ జ్వరాలు ?

చెన్నై, మే 12 (ఆంధ్రజ్యోతి): నగరంలో వారంరోజులుగా కొత్తగా వైరల్ జ్వరాలతో బాధపడుతున్నవారి సంఖ్య రోజురోజుకూ అధికమవుతోంది. సాధారణంగా వర్షాకాలంలో జ్వరాలు వస్తాయి. అవి సులువుగా అన్ని ప్రాంతాలకూ వ్యాపిస్తాయి. ప్రస్తుతం అగ్నినక్షత్రంలో ఈ జ్వరాలను సీజన్ జ్వరాలు అని చెప్పలేమని వైద్యనిపుణులు చెబుతున్నారు. అయినా జ్వరపీడితుల సంఖ్య క్రమంగా పెరుగుతోందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో జ్వరాలతో చేరేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోందన్నారు. కొత్తగా వైరల్ జ్వరాలు కావొచ్చని చెబుతున్నారు. ఈ విషయమై వైరాలజీ నిపుణులు మాట్లాడుతూ... ఇది సాధారణమైన 'ఫ్లూ' జ్వరాలేనని, తెలిపారు. వీటిలో ఇన్‌ఫ్లూయెంజా బి.వైరస్ కాస్త వైవిధ్యంగా ఉంటుందని చెప్పారు. జ్వరం తగ్గినప్పటికి రెండు వారాల పాటు గొంతు నొప్పిగా ఉంటుందన్నారు. ఈ గొంతునొప్పి వల్ల మాటలు సరిగా రావని, దీని కారణంగానే నగరవాసులు ఈ రకం జ్వరాలంటే భయపడుతున్నారని, ఈ విషయంలో ఎలాంటి ఆందోళన చెందనవసరం లేదన్నారు. ప్రస్తుతం నగరమంతా జ్వరాలు వ్యాప్తి చెందుతుండటాన్ని రాష్ట్ర రోగనిరోధక శాఖ అధికారులు పరిశీలిస్తున్నారని, ఎలాంటి వైరస్ లేదని నిర్ధారణ అవుతోందని తెలిపారు. అయినప్పటికీ రక్త నమూనాలు సేకరించి పరీక్షిస్తున్నారని చెప్పారు.

రాష్ట్రాన్ని కాపాడే సత్తా ఈపీఎస్‌కే ఉంది

● అన్నాడీఎంకే మహిళా విభాగం సహాయ కార్యదర్శి గాయత్రి

పెరంబూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకేను కాపాడుతున్నట్లుగానే రాష్ట్రాన్ని కూడా కాపాడే సత్తా తమ పార్టీ అధినేత ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్)కే వుందని ఆ పార్టీ మహిళా విభాగ సహాయ కార్యదర్శి గాయత్రి రఘురాం పేర్కొన్నారు. ఈపీఎస్ 71వ జన్మదినం సందర్భంగా సోమవారం ఎంజీఆర్ యువజన విభాగం సహాయ కార్యదర్శి డా.వి.సునీల్ ఆధ్వర్యంలో టి.నగర్ పాండీబజార్‌లో తిరువళ్లూర్, చెంగల్పట్టు, కాంచీపురం, తిరువణ్ణామలై, విల్లుపురం జిల్లాల పేద ప్రజలకు పాడి ఆవులు, లేగదూడలు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గాయత్రి మాట్లాడుతూ... వచ్చే అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఈపీఎస్ మళ్లీ సీఎం కానున్నారని జోస్యం చెప్పారు. డీఎంకే ఎన్నికల హామీల్లో 10 శాతం కూడా అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. కార్యక్రమంలో పురట్చితలైవి అమ్మ పేరవై సహాయ కార్యదర్శి, మాజీ ఎంపీ జె.జయవర్ధన్, మాజీ కౌన్సిలర్ ఆర్సీ ఆర్ముగం, పోస్టాఫీసు చిన్నయ్య, ఎస్ఎంఎస్ జాహీర్‌హుస్సేన్, కె.సూర్యకళ, ఎస్.జయరామన్, టి.నగర్ పి.పద్మనాభన్, వి.సురేష్‌కుమార్, కరాటే ఎస్.శేఖర్, ఎస్.సురేష్‌కుమార్, ఎం.లోకనాధన్, నక్కీరన్‌గర్ సి.సురేష్ సహా కార్యకర్తలు పాల్గొన్నారు.



పేదలకు పాడి ఆవులు, లేగదూడలు అందజేస్తున్న గాయత్రి రఘురాం, డా.సునీల్ తదితరులు

ఊటీలో సీఎం స్టాలిన్

● నాలుగు రోజులు అక్కడే మకాం

చెన్నై, మే 12 (ఆంధ్రజ్యోతి): ఐదురోజుల పర్యటన నిమిత్తం నీలగిరి జిల్లా ఊటీకి సోమవారం మధ్యాహ్నం వెళ్ళిన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు దారి పొడవునా పార్టీ శ్రేణులు, స్థానికులు ఘనస్వాగతం పలికారు. ఊటీ వేసవి ఉత్సవాల్లో అత్యంత ప్రాధాన్యమైన ఫ్లవర్ షోను ఈ నెల 15న సీఎం ప్రారంభించనున్నారు. దీంతోపాటు మరిన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సీఎం సోమవారం ఉదయం చెన్నై నుంచి విమానంలో బయలుదేరి కోవై విమానాశ్రయానికి చేరుకున్నారు. విమానాశ్రయం వద్ద డీఎంకే జిల్లా నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రముఖులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. తర్వాత స్టాలిన్ కారులో ఊటీ బయలుదేరారు. ఊటీ చేరుకున్న ఆయనకు నీలగిరి జిల్లా నాయకులు, కార్యకర్తలు కొత్తగిరి, కట్టపెట్టు ఊటీ చేరింగ్‌క్రాస్ తదితర ప్రాంతాల వద్ద ఘనస్వాగతం పలికారు. ఊటీ ప్రభుత్వ అతిథి గృహానికి చేరుకున్న స్టాలిన్ అక్కడే రాత్రి బసచేశారు. మంగళ, బుధవారాల్లో ఊటీ తదితర ప్రాంతాల్లో జరిగే ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొని వివిధ సంక్షేమ పథకాలను లబ్దిదారులకు పంపిణీ చేస్తారు.

15న బొటానికల్ గ్రౌండ్‌లో 127 ఫ్లవర్‌షో ప్రారంభిస్తారు. ఈ నెల 16న ఊటీ నుంచి కారులో కోయంబత్తూరు విమానాశ్రయానికి చేరుకుని, విమానంలో నగరానికి విచ్చేయనున్నారు. ముఖ్యమంత్రి పర్యటనను పురస్కరించుకుని నీలగిర జిల్లా అంతటా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు.



కోవై విమానాశ్రయం నుంచి ఊటీకి వెళ్తున్న సీఎం స్టాలిన్

సమాచార దృష్టి

ఇంజనీరింగ్ కోర్సులకు 91వేల దరఖాస్తులు

పెరంబూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కోర్సుల ప్రవేశానికి 91,414 మంది దరఖాస్తు చేశారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు స్వీకరణ ఈ నెల 7వ తేది ప్రారంభమైంది. ఆదివారం సాయంత్రం వరకు 91,414 దరఖాస్తులు అందాయి. వారిలో 39,633 మంది ఫీజు చెల్లించగా, 17,255 మంది సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేశారు. www.tneaonline.org అనే వెబ్‌సైట్‌లో జూన్ 6వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

ఐదేళ్ల లా కోర్సులో ప్రవేశాలకు...

రాష్ట్రంలోని న్యాయ కళాశాలల్లో ఐదేళ్ల లా కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తు స్వీకరణ ప్రారంభమైంది. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు న్యాయ కళాశాలల్లో ఐదేళ్ల లా కోర్సులో 3,024 సీట్లున్నాయి. 2025-26వ విద్యా సంవత్సరానికి ఈ కోర్సులో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు, tndalu.ac.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని డా.అంబేడ్కర్ న్యాయ విశ్వవిద్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

25న వేదవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 'వెన్నెలకంటి సాహిత్యం'పై ప్రసంగం

చెన్నై, మే 12 (ఆంధ్రజ్యోతి): వేద విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 25న 'వెన్నెలకంటి సాహిత్యం - సినీ వెన్నెల జలపాతం' అనే అంశంపై 161వ ప్రసంగ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు వేదిక అధ్యక్షుడు జేకే రెడ్డి, కందనూరు మధు ఓ ప్రకటనలో తెలిపారు. తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహికగా టి.నగర్ ఆంధ్రాక్లబ్, కృష్ణాహాల్‌లో జరిగే కార్యక్రమంలో మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య విస్తాలి శంకరరావు వక్తగా పాల్గొని ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమానికి సాహితీ ప్రియులందరూ ఆహ్వానితులేనని నిర్వాహకులు పేర్కొన్నారు.

మినీ బస్సుల కొనుగోలుకు టెండర్లు

పెరంబూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): మెట్రో ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) వంద మినీ బస్సుల కొనుగోలు టెండర్లు ఆహ్వానిస్తోంది. నగరంలో అన్ని ప్రాంతాలకు బస్సులు నడిపేలా 2013లో మినీ బస్సులు ప్రారంభించారు. ప్రస్తుతం 146 మినీ బస్సులుండగా, వాటిలో 22 బస్సులు మెట్రో ప్రయాణికుల సేవల కోసం ప్రత్యేకంగా కేటాయించారు. ఈ క్రమంలో, జీపీఎస్, పానిక్ బటన్, పార్కింగ్ కెమెరా తదితర అత్యాధునిక వసతులతో కూడిన వంద మినీ బస్సుల కొనుగోలుకు రూ.34 కోట్లు కేటాయించిన ప్రభుత్వం, జూన్ 15వ తేదిలోగా టెండర్లు దాఖలుచేయాలని ప్రకటనలో తెలిపింది.

వాట్సాప్ ద్వారా ఎల్ఐసీ ప్రీమియం చెల్లింపు

పెరంబూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): వాట్సాప్ ద్వారా బీమా ప్రీమియం చెల్లించే సదుపాయాన్ని ఎల్ఐసీ పరిచయం చేసింది. అన్ని సేవలు డిజిటలైజేషన్ అవుతున్న నేపథ్యంలో, ఎల్ఐసీ కూడా వినియోగదారులకు సత్వర సేవలు అందించేలా చర్యలు చేపట్టింది. ఆ ప్రకారం, వాట్సాప్ ద్వారా పాలసీదారులు తమ ప్రీమియం చెల్లించవచ్చు. ఏ ప్రాంతంలో ఉన్నా, ఏ సమయంలోనైనా ప్రీమియం చెల్లించే వసతి కల్పించినట్లు ఎల్ఐసీ ఉన్నతాధికారులు తెలిపారు.

ప్లస్ టూ తాత్కాలిక మార్కుల జాబితా

పెరంబూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాఠ్యప్రణాళికలో ప్లస్ టూ పబ్లిక్ ఫలితాలు ఈ నెల 8వ తేది విడుదలయ్యాయి. తాత్కాలిక మార్కుల జాబితాను సోమవారం విడుదల చేశారు. విద్యార్థులు www.dge.tn.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా తాత్కాలిక మార్కుల జాబితా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అలాగే, జవాబు పత్రాల నకళ్ల కోసం తాము చదివిన పాఠశాలలు, ప్రైవేటు అభ్యర్థులు తాము పరీక్ష రాసిన పాఠశాలల ద్వారా మంగళవారం నుంచి ఈ నెల 17వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలి. అన్ని పాఠ్యాంశాలకు రూ.275 చెల్లించాలని, నకళ్లు, రీ కౌంటింగ్, రీ వాల్యుయేషన్ కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వ పరీక్షల శాఖ తెలియజేసింది.

కొత్త రైలు మార్గాలకు రూ.6,626 కోట్లు

పెరంబూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 8 కొత్త రైలు మార్గాల ఏర్పాటుకు రైల్వే శాఖ రూ.6,626 కోట్లు కేటాయించిందని సమాచార హక్కు చట్టం ద్వారా తెలిసింది. ఆ ప్రకారం, దిండివనం-నగరి ప్రాజెక్టుకు రూ.347.7 కోట్లు, అరుప్పుకోట మార్గంలో మదురై, తూత్తుకుడి ప్రాజెక్టుకు రూ.55.2 కోట్లు, ఈసీఆర్ మార్గంలో చెన్నై-కడలూరు ప్రాజెక్టుకు రూ.5.2 కోట్లు కేటాయించారు. అలాగే, 20 ఏళ్ల నాటి డిమాండ్ అయిన పళని-ఈరోడ్ ప్రాజెక్టుకు రూ.50 కోట్లు, సెంజి మార్గంలో దిండివనం-తిరువణ్ణామలై రూ.42.7కోట్లు, అత్తిపట్టు-పుదూర్‌కు రూ.42.7 కోట్లు, ధర్మపురి-మోరప్పూర్ ప్రాజెక్టుకు రూ.22.2 కోట్లు, ఆవడి-శ్రీపెరుంబుదూర్-గుడువాంజేరి రైల్వే ప్రాజెక్టుకు రూ.4.27 కోట్లు రైల్వే శాఖ కేటాయించిందని సమాచార హక్కు చట్టం ద్వారా తెలిసింది.

కళాశాల విద్యార్థులకు ప్రత్యేక పరీక్షలు

పెరంబూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): అన్నా విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలు, అన్నా విశ్వవిద్యాలయం దూరవిద్య ద్వారా ఇంజనీరింగ్ కోర్సు విద్యార్థులకు దీర్ఘకాలంగా మిగిలిన అరియర్ పరీక్షలు రాసేందుకు ప్రత్యేక అవకాశం కల్పించారు. ఈ మేరకు అన్నా వర్సిటీ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో.. నిర్ణీత కాల వ్యవధిలో అరియర్ సబ్జెక్టులున్న అభ్యర్థులు ఏప్రిల్-మే 2025, జూన్-జూలై 2025లో ప్రత్యేక అరియర్ పరీక్షలు రాసేందుకు అనుమతించామన్నారు. ఈ ప్రత్యేక అరియర్ పరీక్షలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల సంఖ్య ఆధారంగా పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేస్తామని తెలిపింది. అరియర్స్ ఉన్న విద్యార్థులు http://coe1.annauniv.edu అనే వెబ్‌సైట్‌లో ఈ నెల 17వ తేదిలోపు దరఖాస్తులు సమర్పించాలి. పరీక్షా కేంద్రాలు, టైంటేబుల్ తదితరాలు ఈ నెల 27వ తేది తర్వాత విడుదల చేయనున్నట్లు వర్సిటీ తెలియజేసింది.

వస్త్ర దుకాణంలో అగ్నిప్రమాదం

పెరంబూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్‌లోని వస్త్ర దుకాణంలో అగ్నిప్రమాదం సంభవించింది. టి.నగర్ ప్రాంతంలోని రంగనాథన్ వీధి నిత్యం కొనుగోలుదారులతోను, రైల్వేస్టేషన్‌కు వెళ్లే వారితో రద్దీగా ఉంటుంది. ఈ క్రమంలో, రంగనాథన్ వీధిలోని ఓ ప్రముఖ వస్త్ర దుకాణంలో సోమవారం ఉదయం హఠాత్తుగా మంటలు చెలరేగాయి. రెండంతస్తుల భవనంలో ఖరీదైన వస్త్రాలు రెండో అంతస్తులో ఉండగా, అక్కడి నుంచి మంటలు చెలరేగాయి. పొగ గమనించిన ఉద్యోగులు హుటాహుటిన దుకాణం నుండి బయటకు పరుగులు తీశారు. పొగలు చెలరేగుతున్న సమయంలో పోలీసులు ఈ ప్రాంతంలో బ్యారికేడ్లు ఏర్పాటుచేసి ప్రజలను అనుమతించలేదు. గంటన్నర సేపు శ్రమించిన అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపుచేశారు. ఈ ఘటనలో లక్షల విలువైన దుస్తులు దగ్ధమైనట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదుచేసి విచారిస్తున్నారు.



వస్త్ర దుకాణాన్ని కమ్ముకున్న దట్టమైన పొగ

వచ్చే రెండు నెలల్లో పది లక్షల మందికి ఇళ్ల పట్టాలు

పెరంబూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రానున్న రెండు నెలల్లో 10 లక్షల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేయనున్నట్లు నగరపాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ తెలిపారు. తిరునల్వేలి పాళయంకోటలోని నెహ్రూ ఆడిటోరియంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో వివిధ శాఖల తరఫున 2167 మంది లబ్దిదారులకు రూ.7 కోట్ల విలువైన సంక్షేమ సహాయాలను మంత్రి పంపిణీ చేశారు. స్పీకర్ అప్పావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి నెహ్రూ మాట్లాడుతూ.. 20 ఏళ్ల క్రితం అప్పటి ముఖ్యమంత్రి కరుణానిధి, తిరుచ్చి పట్టణ ప్రాంతాల్లోని 1,500 మందికి ఇళ్ల పట్టాలు అందజేశారని తెలిపారు. ప్రస్తుత ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మంత్రివర్గ సమావేశంలో ఏర్పాటుచేసి, పట్టణ ప్రాంతా ల్లో కూడా పట్టాలివ్వాలని తీర్మానించారని తెలిపారు. అలా మూడు సెంట్ల ఇంటి పట్టా ఇస్తే దాని విలువ పెరుగుతుందని, అందువల్ల 2 సెంట్లు ఇవ్వాలని తీర్మానించారని అన్నారు. ఆ తీర్మానం ప్రకారం, అన్ని నగర ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలం విలువ రూ.5 లక్షలోపుంటే, జిల్లా కలెక్టర్ పట్టా ఇవ్వొచ్చని, రూ.5 లక్షల కంటే ఎక్కువగా ఉంటే రాష్ట్రస్థాయి కమిటీకి సిఫారసు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ తీర్మానం ప్రకారం, గ్రామాలు, పట్టణ ప్రాంతాల ప్రజలకు పట్టాలు అందించనున్నామని, ఆ ప్రకారం, రానున్న రెండేళ్లలో 10 లక్షల మందికి ఇళ్ల పట్టాలు అందించాలని ముఖ్యమంత్రి ఉత్తర్వులు జారీచేశారని మంత్రి నెహ్రూ తెలిపారు.



మంత్రి కేఎన్ నెహ్రూ

మనస్థాపంతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

పెరంబూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): కాలు తొలగించాలని వైద్యులు చెప్పడంతో మనస్తాపం చెందిన డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వేళచ్చేరిలో చోటుచేసుకుంది. వేళచ్చేరి ఎంజీఆర్ నగర్‌కు చెందిన బాబు (50) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మధుమేహంతో బాధపడుతున్న బాబు కాలులోని రెండు వేళ్లు తొలగించారు. వ్యాధి తీవ్రం కావడంతో ఒక కాలు తొలగించాలని వైద్యులు తెలిపారు. ఓమందూర్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాబు, కాలు తీయాలని వైద్యులు తెలిపిన తర్వాత ఆస్పత్రి నుంచి బయటకు వచ్చాడు. కుమారుడు, బంధువులు అతడిని సముదాయించారు. ఈ క్రమంలో, శనివారం రాత్రి బాబు తన గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం ఎంతసేపటికీ గది నుంచి బయటకు రాకపోవడంతో అనుమానించిన కుటుంబ సభ్యులు, గది తలుపులు బద్దలుకొట్టి లోనికి వెళ్లగా బాబు ఆత్మహత్యకు పాల్పడడం గమనించి దిగ్భ్రాంతి చెందారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

షేర్ మార్కెట్లో లాభాలంటూ రూ.90 లక్షల మోసం

పెరంబూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): షేర్ మార్కెట్లో అధిక లాభాలు వస్తాయని నమ్మించి రూ.90 లక్షల మోసానికి పాల్పడిన వ్యక్తి కోసం సైబర్ క్రైం పోలీసులు గాలిస్తున్నారు. తిరుప్పూర్ జిల్లాకు చెందిన 37 ఏళ్ల పారిశ్రామికవేత్తకు ఫిబ్రవరి 18వ తేదీ వాట్సాప్ ద్వారా ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. స్టాక్ మార్కెట్ సభ్యుడిగా పరిచయం చేసుకున్న ఆ వ్యక్తి, షేర్ మార్కెట్లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించాడు. అనంతరం పారిశ్రామికవేత్తను తన వాట్సాప్ గ్రూప్‌లో సభ్యుడిగా చేర్చినట్లు తెలిపి, గ్రూప్ సభ్యులు షేర్ మార్కెట్లో ఎంత లాభాలు సంపాదించారు అనే వివరాలను పంపించాడు. దీనిని నమ్మిన పారిశ్రామికవేత్త వాట్సాప్‌లో పేర్కొన్న బ్యాంక్ ఖాతాకు 17 విడతలుగా రూ.90 లక్షలు పంపించాడు. ఈ క్రమంలో పెట్టుబడుల ద్వారా వచ్చిన లాభాన్ని తీసుకోవాలని పారిశ్రామికవేత్త భావించగా మూడు శాతం అదనపు రుసుము చెల్లించాలని తెలిపాడు. అదనపు రుసుము చెల్లించలేనని పారిశ్రామికవేత్త తెలియజేయగా, అదనంగా రూ.60 లక్షలు బ్యాంక్ ఖాతాలో జమచేయాలని సదరు వ్యక్తి తెలిపాడు. దీంతో మోసపోయానని గుర్తించిన పారిశ్రామికవేత్త ఆన్‌లైన్ ద్వారా సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

తల్లిదండ్రులు చెల్లిపై ప్రేమ చూపిస్తున్నారని అక్క ఆత్మహత్య

పెరంబూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు చెల్లెలుపై ఎక్కువ ప్రేమ చూపుతున్నారంటూ 10వ తరగతి విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కోయంబత్తూర్‌లో చోటుచేసుకుంది. పాపనాయకన్‌పాళయం పళయూరుకు చెందిన సురేష్‌కుమార్ పెద్దకుమార్తె సాహిత్య (15) టెన్త్ చదువుతోంది. చిన్నకుమార్తె మూడవ తరగతి చదువుతోంది. సాహిత్య-ఆమె చెల్లి మధ్య ఏడేళ్ల వ్యత్యాసం ఉంది. తల్లిదండ్రులు... నీ కంటే చెల్లెలు చిన్నది, దాని అవసరాలు నువ్వే చూసుకోవాలని చెబుతుండేవారు. దీంతో తన కంటే చెల్లెలు అంటే తల్లిదండ్రులకు ఇష్టమని సాహిత్య బాధపడుతుండేది. ఘటన జరిగిన రోజున చిన్నకుమార్తె మొక్కజొన్నలు కావాలని కోరగా తల్లి సాహిత్యను మొక్కజొన్నల కోసం పంపింది. దుకాణానికి వెళ్లి మొక్కజొన్నలు తీసుకురాగా, తల్లి చెల్లెలను ఒళ్లో కూర్చొబెట్టుకుని మొక్కజొన్నలు తినిపించడం చూసి సాహిత్య మనస్తాపం చెందింది. వెంటనే తన గదిలోకి వెళ్లిన సాహిత్య ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సాహి త్య బయటకు రాకపోవడంతో అనుమానించిన తల్లిదండ్రులు లోనికి వెళ్లి చూడగా, ఫ్యానుకు ఉరేసుకున్న సాహిత్యను చూసి బోరున విలపించారు. సమాచారం అందుకున్న రేస్‌కోర్స్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

డీఎంకేతోనే రాష్ట్రాభివృద్ధి

● బహిరంగ సభలో నేతలు



సభలో మాట్లాడుతున్న డీఎంకే నేతలు

తిరుత్తణి, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమార్థం రాష్ట్రప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేసిందని, రాష్ట్ర అభివృద్ధి డీఎంకేతోనే సాధ్యమని డీఎంకే రాష్ట్ర కార్యదర్శి రాజేంద్రన్ అన్నారు. తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు మండలంలోని జంగాలపల్లి గ్రామంలో డీఎంకే శ్రేణుల బహిరంగ సభ ఘనంగా జరిగింది. ఆదివారం సాయంత్రం మండల కార్యదర్శి బీడీ చంద్రన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీఎంకే మండల కార్యదర్శి పి.రవీంద్రనాథ్ రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ మురళిసేన, వీవీ మణి, గోవర్ధన్ నాయుడు, కుమరేశన్ పాల్గొన్నారు.

బైక్ నడిపి ప్రమాదానికి గురై బాలుడి మృతి

చెన్నై, మే 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక వండలూరు - మీంజూరు బైపాస్ రోడ్డులో సోమవారం మధ్యాహ్నం సంభవించిన ప్రమాదంలో బైక్ నడిపిన 13 ఏళ్ల బాలుడు మృతిచెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పూందమల్లి సమీపం నజరేత్‌పేట ప్రాంతానికి చెందిన కలైవానన్ కుమారుడు ప్రియన్ (13) ఏడో తరగతి చదువుతున్నాడు. సోమవారం మధ్యాహ్నం తన తండ్రి ద్విచక్ర వాహనం తీసుకెళ్లిన ప్రియన్ తన ఇద్దరు స్నేహితులతో కలసి వండలూరు-మీంజూరు బైపాస్ రోడ్డు వెళుతుండగా, హఠాత్తుగా వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో వాహనం నుంచి పడిన ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు, ప్రియన్ అప్పటికే మృతిచెందాడని, మిగిలిన ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

కుమార్తెను హత్య చేసి తండ్రి ఆత్మహత్య

అడయార్, మే 12 (ఆంధ్రజ్యోతి): తనతో వాగ్వివాదానికి దిగిన కుమార్తెను గొంతునులిమి హత్య చేసిన తండ్రి తాను కూడా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషాదకర ఘటన అరియలూరు ఆండిమఠంలో జరిగింది. పోలీసులు కథనం మేరకు... ఆండిమఠంకు చెందిన రవి (50) అనే ఆటో డ్రైవర్‌కుకు భార్య సెల్వి (45), కుమార్తెలు రంజిని (16), సంధ్య (17) ఉన్నారు. ఇదిలావుండగా ఆ ప్రాంతంలో రవి ఒక ఇలు నిర్మిస్తుండగా, భార్య సెల్వి, కుమార్తె రంజిని పనిచేస్తున్నారు. వీరికి భోజనం తయారు చేసి, తీసుకెళ్ళి ఇవ్వాల్సిన సంధ్య పని చేయకుండా మొబైల్ ఫోన్ చూస్తూ కూర్చొండిపోయింది. ఈ విషయంపై తండ్రీ కుమార్తె మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో ఆగ్రహానికి గురైన తండ్రి.. కుమార్తె ను హత్య చేసి ఆ తర్వాత తాను ఉరేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు.

చర్చి తొలగింపుపై నిరసన



పోలీసులతో మాట్లాడుతున్న క్రైస్తవులు

వేలూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా సెంజి మెట్టూరు సమీపంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి చర్చి నిర్మించారని సోమవారం ఉదయం కూల్చివేసేందుకు వచ్చిన రెవెన్యూ అధికారులతో స్థానికులు వాగ్వాదానికి దిగారు. చర్చిని కూల్చొద్దని, నగదు పోగు చేసుకుని నిర్మించుకున్నామని పాస్టర్ అధికారులను వేడుకున్నాడు. అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపుతామని పోలీసుల హామీతో నిరసన విరమించుకున్నారు.

తిరుత్తణిలో భారీ వర్షం



తిరుత్తణి, మే 12 (ఆంధ్రజ్యోతి): ఎండ వేడికి అల్లాడే ప్రజలు సోమవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి కాస్త సేద దీరారు. తిరువళ్లూరు జిల్లాలో నెల రోజులుగా వేసవి ఎండలు విజృంభిస్తున్న సమయంలో తిరువళ్లూరు, తిరుత్తణి, కుమారరాజుపేట, పళ్లిపట్టు తదితర ప్రాంతాల్లో సుమారు 3 గంటల పాటు ఉరుములు మెరుపులతో కూడిన గాలలు వీచాయి. అదే సమయంలో భారీ వర్షం కురవటంతో వాతావరణం చల్లబడింది.

డిస్ట్రిబ్యూటర్ ఇంట్లో చోరీ ... నిందితుడి అరెస్టు

అడయార్, మే 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక వడపళనిలో ఒక సినిమా పంపిణీదారుడి ఇంట్లో వెండి వస్తువులు, నగదు చోరీకి గురయ్యాయి. నిందితులను పోలీసులు అరెస్టు చేసి 450 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. వడపళని రాఘవన్ కాలనీకి చెందిన భోజరాజన్ ముంబైలో ఉండగా, ఈయన తండ్రి ప్రేమ్ ఆనంద్ సినీ డిస్ట్రిబ్యూటర్. ప్రేమ్ ఆనంద్ గుండె జబ్బుతో బాధపడుతూ షోళింగనల్లూరులోని కుమార్తె వద్ద ఉంటున్నారు. ఈ క్రమంలో వడపళనిలోని ఇంటికి వారానికి ఒకసారి వచ్చి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 8వ తేదీ ఇంటికి వచ్చిన ప్రేమ్ ఆనంద్.. చోరీ జరిగినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేపట్టి ఎంజీఆర్ నగర్, అన్నై సత్య నగర్‌కు చెందిన సంతోష్, అతని స్నేహితుడు 17 యేళ్ళ బాలుడితో కలిసి చోరీ చేసినట్టు గుర్తించారు. దీంతో వీరిద్దరిని అరెస్టు చేశారు.

కొడంగయూరులో రూ.1026 కోట్లతో విద్యుత్ కేంద్రం

చెన్నై, మే 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొడుంగ యూరులో రూ.1026 కోట్లతో విద్యుత్ ఉత్పాదక కేంద్రాన్ని నిర్మించనున్నారు. అక్కడి కార్పొరేషన్ డంపింగ్‌యార్డులోని చెత్త, తదితర వ్యర్థాల నుండి రోజూ 31 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయనున్నారు. మేయర్ ప్రియ, కమిషనర్ కుమారగురుబరన్, ఇంజనీర్లు ప్యారిస్ వెళ్లారు. అక్కడ వ్యర్థ పదార్థాల నుండి విద్యుత్ ఉత్పత్తి చేసే పద్ధతి కూడా పరిశీలించారు. ప్రస్తుతం ఫ్రాన్స్ సహకారంతో కొడుంగయూరు డంపింగ్ యార్డు వద్దే వ్యర్థాల నుండి విద్యుత్‌ను ఉత్పత్తి చేసే కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు.

'ఆశ'ల ధర్నా



రాజరత్నం స్టేడియం వద్ద తమ డిమాండ్ల సాధన కోసం ధర్నా చేస్తున్న ఆశా కార్మిక సంఘం సభ్యులు

మంటలు



చెన్నై చేపాక్కం లోని ప్రెస్‌క్లబ్ ప్రాంగణంలో ఉంచిన ఓ తమిళ ఛానల్ వాహనం హఠాత్తుగా అగ్నిప్రమాదానికి గురైన దృశ్యం

సీఎంకు జాక్టో-జియో కృతజ్ఞతలు

పెరంబూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): జాక్టో-జియో సభ్యులపై అన్నాడీఎంకే ప్రభుత్వం నమోదు చేసిన కేసులు, క్రమశిక్షణ చర్యలు రద్దు చేసిన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు ఆ సంఘ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆ సంఘం ఆర్గనైజర్ దాస్ విడుదల చేసిన ప్రకటనలో.. తమ న్యాయమైన కోర్కెల సాధనకు ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంఘాల సమాఖ్య (జాక్టో-జియో) ఆందోళన చేపట్టిందన్నారు. ఆ సమయంలో అధికారంలో ఉన్న అన్నాడీఎంకే ప్రభుత్వం జాక్టో-జియో సభ్యులపై తప్పుడు కేసులు బనాయించిందన్నారు. ఈ కేసుల కారణంగా పదోన్నతులు, బదిలీలు, పాస్ పోర్ట్ తదితరాలు పొందడంలో సంఘ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ఈ సమయంలో ప్రతిపక్ష నేతగా ఉన్న ఎంకే స్టాలిన్, తాము అధికారంలోకి వస్తే జాక్టో-జియో సభ్యులపై నమోదైన కేసులు, క్రమశిక్షణా చర్యలు రద్దు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. తాజాగా, కేసులు, క్రమశిక్షణా చర్యలు రద్దు చేయడం, ఆందోళన చేపట్టిన రోజులను పనిదినాలుగా గుర్తిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంపై ముఖ్యమంత్రి స్టాలిన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నాధుక్కార మఠంలో అన్నదానం



వేలూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): చిత్రా పౌర్ణమిని పురస్కరించుకుని వేలూరులోని నాధుక్కార మఠం ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఇందులో మురుగన్ భక్త జన సమాఖ్య నిర్వాహకులు పాల్గొని పాదయాత్ర చేసే భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మఠం ట్రెజరర్ రాధాకృష్ణన్ మాట్లాడుతూ, చిత్రా పౌర్ణమి సందర్భంగా తిరువణ్ణామలైకు పాదయాత్రగా వెళ్ళే భక్తులకు ప్రతిఏటా అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు భారతి, శంకర్, సుబ్రహ్మణ్యన్, సాధుక్కార మఠం సభ్యులు పాల్గొని వెయ్యి మంది భక్తులకు అన్నదానం చేశారు.

ఈపీఎస్ జన్మదినం సందర్భంగా రక్తదానం



వేలూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పుట్టినరోజు సందర్భంగా వేలూరులో సోమవారం ఉదయం అన్నాడీఎంకే కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా అన్నాడీఎంకే కార్యదర్శి అప్పు, దాసు, మూర్తి, శూలై ఆనంద్, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రం ప్రారంభం



పూజా కార్యక్రమంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా పీంజమిండై గ్రామంలో రూ.50 లక్షలతో నిర్మించిన అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజా సంక్షేమార్థం రాష్ట్రప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతోందని, ప్రజలు వాటిని సద్వినియోగ పరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అనైకట్టు ఎమ్మెల్యే నందకుమార్ సహా అంగన్వాడీ ఉద్యోగులు పాల్గొన్నారు.

చెట్టు కూలి ఇద్దరు మహిళల మృతి

పెరంబూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై జిల్లాలో మర్రిచెట్టు కూలిపడి ఇద్దరు మహిళలు మృతిచెందగా మరికొందరికి గాయాలయ్యాయి. కళనిపాక్కంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కార్మికులు సోమవారం మధ్యాహ్నం వర్షం కురుస్తుండడంతో సమీపంలోని మర్రి చెట్టు కిందకు వెళ్లారు. ఆ సమయంలో హఠాత్తుగా ఈదురుగాలులకు వీయడంతో మర్రి చెట్టు కూలింది. చెట్టు శిధిలాల కింద చిక్కుకున్న అన్నపూర్ణి (45), వేండా (49) మృతిచెందారు. చుట్టుపక్కల వారు గాయపడిన ఐదుగురిని రక్షించి చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

కళ్లలగర్ ఆగమనోత్సవంలో విషాదం తొక్కిసలాటలో ఇద్దరి మృతి

చెన్నై, మే 12 (ఆంధ్రజ్యోతి): మదురై వైగైనది వద్ద సోమవారం ఉదయం నిర్వహించిన కళ్లలగర్ ఆగమనోత్సవంలో ఇద్దరు మృతి చెందారు. భక్తుల రద్దీలో చిక్కుకుని వీరు ప్రాణాలు కోల్పోయారు. వైగైనదిలో కళ్లలగర్ ముందుగా ప్రవేశించే ప్రాంతమైన మండకప్పడి వద్ద తిరునల్వేలి జిల్లా తాళైయూత్తు ప్రాంతానికి చెందిన భూమినాధన్ (65) నిలిచి వేడుకలను తిలకిస్తుండగా ఉన్నట్టుండి అస్వస్థత చెంది మూర్ఛిల్లారు. పక్కనే ఉన్న కొంతమంది గమనించి భూమినాథన్‌ను అక్కడ ఉన్న అంబులెన్స్‌లో ఎక్కించి ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. అయితే ఆ ప్రాంతంలో భక్తులను అదుపుచేసేందుకు మూడు వైపులా బారికేడ్లు ఏర్పాటు చేశారు. దీంతో అంబులెన్స్ అక్కడి నుండి కదలలేకపోయింది. అరగంట తరువాత కొన్ని బారికేడ్లను తొలగించగా, అంబులెన్స్ బయలుదేరింది. ఆసుపత్రికి చేరిన తరువాత భూమినాధన్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు మృతి చెందినట్టు ప్రకటించారు. ఇదే విధంగా ఈ వేడుకల్లో భక్తుల రద్దీ మధ్య చిక్కుకుని కన్నన్ (43) అనే వ్యక్తి కూడా మృతి చెందారు. ఈ రెండు సంఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

పట్టాలపై రాళ్లు పెట్టిన సాధువు అరెస్టు



ఉత్తరాది సాధువుతో పోలీసులు

చెన్నై, మే 12 (ఆంధ్రజ్యోతి): అరక్కోణం, ఆవడి, తిరువలంగాడు ప్రాంతాల్లో పట్టాలపై రాళ్లు పెట్టి రైళ్లను కూల్చివేసేందుకు కుట్రపన్నాడనే ఆరోపణలపై ఉత్తరాదికి చెందిన సాధువును పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల తిరువళ్లూరు జిల్లా తిరువలంగాడు, ఆవడి, అరకోణం ప్రాంతాల్లో రైలు పట్టాలపై రాళ్లు పెట్టి రైళ్లను కూల్చివేసే ప్రయత్నాలు జరిగాయి. రైల్వే పోలీసులు కేసు నమోదుచేసుకుని పట్టాలపై రాళ్లు ఉంచిన వారి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అదే సమయంలో సంఘటన ప్రాంతంలో సీసీ కెమెరాలలో నమోదైన వీడియో పరిశీలించినప్పుడు కాషాయ దుస్తులు ధరించిన ఓ వ్యక్తి పట్టాలపై రాళ్లు పెడుతున్నట్లు గుర్తించారు.. ఆ వీడియో ఆధారంగా దర్యాప్తు చేయగా ఆ వ్యక్తి ఉత్తరఖండ్ రాష్ట్రం హరిద్వార్ సమీపం హరిపూర్‌కాలనీ గంగానదీ ఒడ్డున నివసిస్తున్న సాధువుగా వెల్లడైంది. ముమ్మరంగా గాలించిఆ ఉత్తరాది సాధువును హైదరాబాద్‌లో అరెస్టు చేశారు. చెన్నైకి తీసుకువచ్చి కోర్టులో హాజరుపరచి ఆయనను జైలుకు తరలించారు.

సెప్టెంబరు 18న ప్రదీప్ 'ఎల్ఐకే' రిలీజ్


"ఎల్ఐకే'లో ప్రదీప్ రంగనాథన్, కృతిశెట్టి

విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో ప్రదీప్ రంగనాథన్ - కృతిశెట్టి జంటగా నటించిన తాజా చిత్రం 'ఎల్ఐకె' (లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ) సెప్టెంబరు 18వ తేదీ విడుదల చేయనున్నట్టు మేకర్స్ సోమవారం అధికారికంగా వెల్లడిస్తూ ఓ వీడియో కూడా రిలీజ్ చేశారు. ఈ మూవీలో ప్రముఖ నటుడు ఎస్‌జే సూర్య ఓ ముఖ్య పాత్ర పోషించగా, యోగిబాబు, గౌరీ కిషన్ తదితరులు ఇతర పాత్రల్లో నటించారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం సమకూర్చగా, రౌడీ పిక్చర్స్ పతాకంపె నయనతార, సెవెన్ స్క్రీన్ స్టూడియోస్ అధినేత ఎస్ఎస్ లలిత్ కుమార్ సంయుక్తంగా నిర్మించారు. ఇప్పటికే ఈ మూవీలోని ఓ పాటకు 33 మిలియన్ల మందికిపైగా వీక్షించారు. సినిమా ఆడియో, ట్రైలర్‌లను త్వరలోనే విడుదల చేయనున్నారు. కాగా, ప్రదీప్ రంగనాథన్ - విఘ్నేష్ శివన్ - అనిరుధ్ కాంబినేషన్‌లో ఈ చిత్రం వస్తుండటంతో మూవీపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటించిన 'లవ్‌టుడే', 'డ్రాగన్' మూవీలు బ్లాక్‌బస్టర్ హిట్స్‌గా నిలిచిన విషయం తెల్సిందే.

రోమియో పిక్చర్స్‌కు 'మూన్‌వాక్' రైట్స్


ప్రభుదేవా, నిర్మాత రాహుల్ తదితరులు

ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్. రెహ్మాన్, ఇండియన్ మైఖేల్ జాక్సన్ ప్రభుదేవా కాంబినేషన్‌లో రూపొందిన 'మూన్‌వాక్' పంపిణీ హక్కులను రోమియో పిక్చర్స్ అధినేత, సినీ నిర్మాత రాహుల్ సొంతం చేసుకున్నారు. ఈ మూవీపై భారీ అంచనాలుండడంతో పంపిణీ హక్కులను సొంతం చేసుకునేందుకు పలు కంపెనీలు పోటీ పడినప్పటికీ రోమియో పిక్చర్స్ సొంతం చేసుకుంది. డిజిటల్ మీడియా కంపెనీ బిహైండ్‌వుడ్స్ వ్యవస్థాపకుడు, సీఈవో మనోజ్ ఎన్ఎస్ దర్శకత్వం వహించారు. ఇందులో యోగిబాబు, అజు వర్గీస్, అర్జున్ అశోకన్, చాట్స్, నిష్మా చెంగప్పా, సుష్మిత నాయక్, రెడిన్ కింగ్‌స్లీ, మొట్టై రాజేంద్రన్, లొల్లు సభా స్వామినాథన్, డాక్టర్ సంతోష్ జాకబ్, దీపా శంకర్, రామ్‌కుమార్ నటరాజన్ నటించారు.

సీమాన్ 'ధర్మయుద్ధ' ఫస్ట్‌లుక్ రిలీజ్


'ధర్మయుద్ధం' ఫస్ట్‌లుక్

ప్రముఖ సినీ దర్శకుడు, నామ్ తమిళర్ కట్చి కన్వీనర్ సీమాన్ నటించిన తాజా చిత్రం 'ధర్మయుద్ధం'. ఈ మూవీ ఫస్ట్‌లుక్‌ను పది మంది సినీ ప్రముఖులు రిలీజ్ చేశారు. 'తప్పడం', 'యాంటీ ఇండియన్', 'ఉయిర్ తమిళుక్కు' వంటి విజయవంతమైన చిత్రాలను రూపొందించిన దర్శకుడు, నిర్మాత ఆదంబవ, ప్లానెట్ 9 పిక్చర్స్ అధినేత డాక్టర్ ఇరా కె.శివకుమార్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. హత్య, దాని నేపథ్యం, సంబంధిత సంఘటనల ఇతివృత్తంతో తెరకెక్కించారు. సీమాన్‌తోపాటు ఆర్‌కే సురేష్ ప్రధాన పాత్రలు పోషించగా, మలయాళ నటి అను సితార కథానాయికగా నటించారు. వీరితో పాటు ఇళవరసు, ఎంఎస్ భాస్కర్, వెట్రి కుమరన్, సాట్టై మురుగన్, జయకుమార్, ఆదిరా పాండ్యలక్ష్మీ, సౌందర్ తదితరులు ఇతర పాత్రలు పోషించారు. ఈ సినిమా ఫస్ట్‌లుక్ ను ప్రముఖ దర్శకులు చేరన్, సుందర్, శీను రామస్వామి, హెచ్.వినోద్, శశికుమార్, నిర్మాత సురేష్ కామాక్షి, నటులు శివకార్తికేయన్, సూరి, ప్రదీప్ రంగనాథన్, నటి కస్తూరి తదితరులు రిలీజ్ చేశారు. నిర్మాతల్లో ఒకరైన ఆదంబవ ఈ చిత్ర విశేషాలను వివరిస్తూ, 'గతంలో రెండు చిత్రాలు పూర్తి రాజకీయ నేపథ్యంలో నిర్మించాను. కానీ, ఈ మూవీలో నామ్ తమిళర్ కట్చి కన్వీనర్‌గా ఉన్న పక్కా రాజకీయ నేత సీమాన్ ప్రధాన పాత్ర పోషించినప్పటికీ ఇది ఒక పొలిటికల్ మూవీ మాత్రం కాదు. ఇందులో సీమాన్ నిజాయితీపరుడైన పోలీస్ అధికారి పాత్ర పోషించారు. ఈ సినిమా దర్శకుడు ఇరా సుబ్రమణియన్‌కు మంచి బ్రేక్ ఇస్తుంది. విశాల్ చంద్రశేఖర్ సంగీత స్వరాలు సమకూర్చారు. త్వరలోనే మూవీని రిలీజ్ చేస్తాం' అని పేర్కొన్నారు.

చిత్రజ్యోతి

కెనిషాతో రవి మోహన్..

● ఆర్తి రవికి నటీమణుల మద్దతు!


గాయని కెనిషాతో రవి మోహన్

హీరో రవి మోహన్ (జయం రవి) బెంగుళూరు గాయని కెనిషా ఫ్రాన్సిస్‌తో ప్రత్యక్షమై ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యపరిచారు. వీరిద్దరినీ కలిసి చూసిన పలువురు సీనియర్ హీరోయిన్లు రవి మోహన్‌ను తప్పుపడుతూ, ఆయన మొదటి భార్య ఆర్తికి సపోర్టు చేస్తూ ట్వీట్స్ చేస్తున్నారు. మొదటి భార్య ఆర్తికి విడాకులు ఇవ్వనున్నట్టు రవి మోహన్ గత యేడాది సెప్టెంబరులో ప్రకటించి, చెన్నై ఫ్యామిలీ కోర్టులో సైతం పిటిషన్ వేయగా కేసు విచారణ దశలో ఉంది. ఈ క్రమంలో రవి మోహన్ ఇపుడు గాయని కెనిషా ఫ్రాన్సిస్‌తో కలిసి ప్రత్యక్షమయ్యారు. వీరిద్దరి ఫొటోలు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. నగరంలో జరిగిన ప్రముఖ సినీ నిర్మాత కుమార్తె వివాహ వేడుకలకు కెనిషా ఫ్రాన్సిస్‌తో కలిసి రవి మోహన్ హాజరుకావడం ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యానికిలోను చేసింది. మరోవైపు, తన వైవాహిక బంధంపై ఎంతోకాలంగా మౌనంగా ఉన్న ఆర్తి తాజాగా మౌనం వీడారు. 'నా విడాకుల కేసు కోర్టులో కొనసాగుతోంది. కానీ 18 యేళ్ళ క్రితం నేను ప్రేమ, నమ్మకం, విధేయతతో అండగా నిలిచిన వ్యక్తి ఇపుడు దూరమయ్యాడు. అతను నా నుంచి దూరం కావడంతో పాటు నాకు ఇచ్చిన వాగ్దానాలను కూడా ఉల్లంఘించాడు' అని పేర్కొన్నారు. ఆర్తి చేసిన పోస్ట్‌పై ఇపుడు చర్చ సాగుతోంది. పలువురు నెటిజన్లు ఆమెకు అండగా నిలువగా మరికొందరు రవి మోహన్‌కు సపోర్టు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సీనియర్ నటీమణులైన రాధిక, ఖుష్బూ వంటివారు ఆర్తికి మద్దతుగా నిలిచారు. 'రాబోయే రోజుల్లో ఒక తల్లి నిజం సాక్షిగా నిలుస్తుంది' అంటూ ఖుష్బూ ట్వీట్ చేస్తే, 'మీరు సత్యాన్ని ఎప్పటికీ మార్చి రాయలేరు' అని రాధిక పేర్కొన్నారు.

డాక్టర్ అమర్ అగర్వాల్‌కు అంతర్జాతీయ అవార్డు


అంతర్జాతీయ అవార్డును అందుకుంటున్న డాక్టర్ అమర్ అగర్వాల్

చెన్నై, మే 12 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ప్రముఖ నేత్రవైద్యనిపుణులు డాక్టర్ అమర్ అగర్వాల్ అంతర్జాతీయ అవార్డును అందుకున్నారు. అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌లో అమెరికన్ సొసైటీ ఆఫ్ కేటరాక్ట్ అండ్ రెఫ్రాక్టివ్ సర్జరీ (ఏసీసీఆర్ఎస్) ఆధ్వర్యంలో నేత్ర వైద్యంలో పిన్‌హోల్ సర్జరీ విభాగంలో అందించిన విశిష్టసేవలకు గాను ఆయనకు ఈ అవార్డును ప్రకటించారు. ఈ సందర్భంగా డాక్టర్ అమర్ అగర్వాల్ మాట్లాడుతూ నేత్రవైద్యంలో తాను ప్రవేశపెట్టిన పిన్‌హోల్ సర్జరీని ప్రస్తుతం నేత్ర వైద్యనిపుణులందరూ పాటిస్తున్నారని, ఆ దిశగానే తనకు ప్రతిష్టాత్మక ఏసీసీఆర్ఎస్ ఫిలిమ్ ఫెస్టివల్ అవార్డు లభించిందని తెలిపారు.

మిస్ కువాగంగా తూత్తుకుడి 'శక్తి' ఎంపిక


'మిస్ కువాగం'గా ఎంపికైన శక్తిని ముద్దాడుతున్న రన్నర్స్

చెన్నై, మే 12 (ఆంధ్రజ్యోతి): కళ్లకురిచ్చి జిల్లా కువాగం గ్రామంలోని సుప్రసిద్ధ కూత్తాండవర్ ఆలయంలో జరిగిన చిత్రాపౌర్ణమి వేడుకల సందర్భంగా ఆదివారం రాత్రి నిర్వహించిన అందాల పోటీల్లో తూత్తుకుడికి చెందిన హిజ్రా శక్తి 'మిస్ కూవాగం'గా ఎంపికయ్యారు. కూత్తాండవర్ ఆలయంలో ఏప్రిల్ 29న చిత్తిరై ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలకు దేశవిదేశాల నుండి వేల సంఖ్యలో హిజ్రాలు హాజరయ్యారు. వీరందరికి ఆహ్లాదం కలిగించే స్థానిక హిజ్రాల సంఘం ప్రతినిధులు సాంస్కృతిక పోటీలు, నృత్యపోటీలు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో జాతీయ హిజ్రాల సమాఖ్య ఆధ్వర్యంలో కూవగమ్ వేడుకలు విల్లుపురం కొత్త బస్‌స్టేషన్ సమీపంలోని మున్సిపాలిటీ గ్రౌండ్‌లో ఏర్పాటయ్యాయి. ఈ వేడుకల్లో మాజీ మంత్రి పొన్ముడి, జిల్లా కలెక్టర్ షేక్ అబ్దుల్ రహ్మాన్, తమిళ సినీ హీరో విశాల్ తదితరులు పాల్గొన్నారు. ఆ తర్వాత మిస్ కూవాగం -2025 అందాల పోటీలు జరిగాయి. విల్లుపురం, కడలూరు, కళ్ళకురిచ్చి, చెన్నై, పుదుచ్చేరి తదితర ప్రాంతాలకు చెందిన 30 మందికి పైగా హిజ్రాలు పాల్గొన్నారు. వీరందరూ అందమైన దుస్తులు ధరించి ర్యాప్‌వాక్ చేశారు. ఫైనల్ రౌండ్‌లో తూత్తుకుడికి చెందిన శక్తి మిస్ కువాగంగా ఎంపికయ్యారు. చెన్నైకి చెందిన తేజా ద్వితీయస్థానం, విపాషా తృతీయ స్థానం సంపాదించుకున్నారు. మిస్ కూవాగంగా ఎంపికైన శక్తికి సీనియర్ హిజ్రాలు కిరీట ధారణ చేసి, నగదు బహుమతిగా రూ. 20వేలు అందించారు. ద్వితీయ, తృతీయ స్థానాలు సంపాదించుకున్న హిజ్రాలకు రూ.15వేలు, రూ.10 వేలు చొప్పున నగదు బహుమతులు అందజేశారు.

చిత్రా పౌర్ణమి గిరిప్రదక్షిణకు 25 లక్షల మంది



వేలూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): చిత్రా పౌర్ణమి సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరువణ్ణామలైలో గిరిప్రదక్షిణకు సుమారు 25 లక్షల మంది భక్తులు పాల్గొన్నట్లు ఆలయ అధికారుల వెల్లడించారు. ఆదివారం అర్ధరాత్రి నుండే ఆలయానికి చేరుకున్న భక్తులు ఆలయ రాజగోపురం ముందు కొబ్బరికాయలు కొట్టి గిరిప్రదక్షిణ ప్రారంభించారు. క్రమంగా సోమవారం ఉదయం 10 గంటలకు వేల సంఖ్యలోవున్న భక్తులు లక్షల్లోకి చేరారు. మార్గమధ్యంలో భక్తులు సేదతీరేందుకు చలివేంద్రాలు, పందిళ్లను ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఆలయ గణాంకాల ప్రకారం భక్తులు గిరిప్రదక్షిణ ఎంతో పవిత్రంగా భావించి పాదయాత్ర చేస్తారని, ఈ ఏడాది అత్యధికంగా సుమారు 25 లక్షల మంది ప్రదక్షిణ పూర్తిచేశారని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ భద్రతా విధుల్లో పాల్గొన్నారు.

చిత్రా పౌర్ణమి పూజల్లో తమిళిసై దంపతులు


పంచశక్తి పీఠంలో డాక్టర్ తమిళిసై, ఆమె భర్త డాక్టర్ సౌందరరాజన్

చెన్నై, మే 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక చోళింగనల్లూరు సమీపం ఆవలూరులోని ఓం పంచశక్తి పీఠాన్ని తెలంగాణా మాజీ గవర్నర్ డాక్టర్ తమిళిసై, ఆమె భర్త సౌందరరాజన్ సోమవారం ఉదయం సందర్శించారు. చిత్రాపౌర్ణమి సందర్భంగా ఇద్దరూ ఆశ్రమంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఓం పంచశక్తి వ్యవస్థాపక పీఠాధిపతి ఓం సత్యేంద్ర స్వామి దేవియమ్మ, ఓం పంచశక్తి పీఠాధిపతి ఓం జ్ఞానసత్యేంద్ర స్వామిల ఆశీస్సులందుకున్నారు. చిత్రాపౌర్ణమిని పురస్కరించుకుని ఆశ్రమంలో అభిషేకం, ఆరాధనలు, అన్నదాన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

నారాయణి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మొబైల్ వైద్యసేవలు



వేలూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): శ్రీపురంలోని నారాయణి ఆస్పత్రి, సేవాభారతి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో పేదప్రజలకు ఉచితంగా వైద్యమందించే మొబైల్ వాహనాన్ని సోమ వారం శ్రీపీఠం వ్యవస్థాపకులు శక్తి అమ్మ ప్రారంభించారు. అనంతరం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్రమంత్రి ఎల్.మురుగన్ జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నారాయణి ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ బాలాజీ, వేలూరు స్వర్ణాలయం డైరెక్టర్ సురేష్‌బాబు, ఫైనాన్స్ కంపెనీ ఛైర్మెన్ సతీష్‌కుమార్ రామదాస్, సేవాభారతి ట్రస్ట్ నిర్వాహకులు రాజన్న, వివేకానందన్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లిడం నదిలో హెలికాప్టర్ ల్యాండింగ్



పెరంబూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): కొల్లిడం నదిలో ఇసుక తిన్నెలపై హెలికాప్టర్ ల్యాండింగ్ కావడంతో ఆ ప్రాంత ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్-పాక్ యుద్ధ వాతావరణం ప్రకంపనాలు సృష్టించింది. ఈ నేపథ్యంలో, అరియలూరు జిల్లా రామనల్లూర్ ప్రాంతంలోని కొల్లిడం నది తీరంలో సోమవారం ఉదయం ఓ హెలికాప్టర్ ల్యాండింగ్ అయి, కొద్దిసేపటి తర్వాత వెళ్లింది. హెలికాప్టర్ నదిలో ఇసుకపై ల్యాండింగ్ కావడంపై ఆ ప్రాంత ప్రజలు ఆందోళన చెందారు. ఆ హెలికాప్టర్ కోవై సూలూరు వైమానిక కేంద్రంలో సైనిక శిక్షణలో భాగంగా ఈ ప్రాంతానికి వచ్చిందని రెవెన్యూ అధికారులు చెప్పడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

కంచి వరదరాజ ఆలయంలో పూజారుల వాగ్వాదం

తలపడిన వడకలై, తెన్‌కలై పండితులు


ఘర్షణ పడుతున్న పూజారులు

అడయార్, మే 12 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లా కేంద్రంలోని ప్రసిద్ధ ఆలయమైన వరదరాజ పెరుమాళ్ ఆలయంలో మళ్ళీ వడకలై, తెన్‌కలై పూజారుల మధ్య వివాదం చెలరేగింది. దీంతో ఇరు వర్గాల వారు పరస్పరం దాడికి పాల్పడడంతో ఆలయంలో ఉద్రిక్తత నెలకొంది. ఈ ఆలయంలో ప్రతి యేటా వైకాశి బ్రహ్మోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఈ యేడాది ఈ వేడుకలు ఈ నెల 11వ తేదీ ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత వరదరాజ పెరుమాళ్, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, ఆరాధనలు చేశారు. అనంతరం బంగారు వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనం ఇచ్చారు. రెండో రోజైన సోమవారం హంస వాహనంలో పెరుమాళ్ మాఢ వీధుల్లో ఊరేగారు. అంతకుముందు పెరుమాళ్‌కు మంత్ర పుష్ప పఠనంపై వడకలై, తెన్‌కలై పండితుల మధ్య ఆధిపత్య పోటీ ఏర్పడింది. వారిమధ్య మాటల యుద్ధానికి, వివాదానికి దారితీసింది. ఆ తర్వాత స్వల్పంగా తోపులాట జరిగింది. ఇరు వర్గాల మధ్య చర్చలు జరగడంతో ఇరువర్గాల వారు శాంతించారు.

నేడు గరుడ సేవ

వరదరాజ పెరుమాళ్ ఆలయ వైకాశి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం గరుడ వాహన సేవ జరుగనుంది. ఈ గరుడ సేవలు వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా యంత్రాంగం, పోలీసులు తగిన చర్యలు తీసుకున్నారు.

తిరువణ్ణామలైలో చిత్రా పౌర్ణమి ఎఫెక్ట్...

● ప్రధాన రహదారుల్లో నిలిచిన ట్రాఫిక్


టోల్‌గేట్ వద్ద బారులుదీరిన వాహనాలు

వేలూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): చిత్రా పౌర్ణమిని పురస్కరించుకుని ప్రముఖ శైవక్షేత్రమైన తిరువణ్ణామలై గిరిప్రదక్షిణ కారణంగా అక్కడి ప్రధాన రహదారులలో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. టోల్‌గేట్లలో కూడా సుమారు గంటపాటు వాహనాలు క్యూలైన్లలో నిలిచిపోయాయి. చిత్రా పౌర్ణమి సందర్భంగా తిరువణ్ణామలై ఆలయానికి ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక, తెలంగాణ సహా పలు రాష్ట్రాలనుండి లక్షల సంఖ్యలో భక్తులు గిరిప్రదక్షిణకు వస్తున్న నేపథ్యంలో, ఆలయ నిర్వాహకులు, కార్పొరేషన్ ఉద్యోగులు ఏర్పాట్లను పరిశీలించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నెల్లయప్పన్ ఆలయానికి రూ.9.55 కోట్లతో రథాలు


వెండి రథం పనులు పరిశీలిస్తున్న మంత్రి శేఖర్‌బాబు

పెరంబూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి నెల్లయప్పర్ గాంధీమతి ఆలయాన్ని ఆదివారం హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్ బాబు సందర్శించారు. ఈ సందర్భంగా నెల్లయప్పన్ గాంధీమతి అమ్మవారి ఆలయానికి రూ.4.85 కోట్లతో తయారుచేస్తున్న వెండి రథం, చండీకేశ్వరునికి రూ.99 లక్షలతో తయారుచేస్తున్న చెక్క రథాలను మంత్రి పరిశీలించారు. అలాగే, అమ్మవారి సన్నిధి జీర్ణోద్ధరణ పనులు, కురుమారి ఉరుమారి ఆలయ కొలను శుభ్రం చేయడం తదితరాలను పరిశీలించిన మంత్రి, పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట హిందూ దేవాదాయ శాఖ కార్యదర్శి పీఎన్ శ్రీధర్, తిరునల్వేలి కలెక్టర్ సుకుమార్, పాళయంకోట ఎమ్మెల్యే అబ్దుల్ వహాబ్, అధికారులు ఉన్నారు.


సోమవారం కడలూరు జిల్లా తిరువందియం దేవనాథస్వామివారి రథోత్సవం


ఊటీలో జరిగిన డాగ్‌షోలో ఉత్తమమైన శునకంగా ఎంపికైన ఇంగ్లీష్ షెటర్. దీనిని దివంగత నటుడు విజయకాంత్ తనయుడు విజయ ప్రభాకర్ పెంచుకుంటున్నారు.

అపోలో ఆస్పత్రిలో నర్సుల దినోత్సవం


అంతర్జాతీయ నర్సుల దినోత్సవంలో పాల్గొన్న నర్సులు, ఆస్పత్రి నిర్వాహకులు

చెన్నై, మే 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అపోలో ఆస్పత్రిలో సోమవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రోగులకు విశిష్టసేవలందించే నర్సులను ఆహ్లాద పరిచేలా సాంస్కృతిక కార్యక్రమాలు, విందు వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో అపోలో హస్పిటల్స్ స్ట్రాటజీ డైరెక్టర్ సిందూరీ రెడ్డి, గ్రూప్ డైరెక్టర్ నర్సింగ్ డాక్టర్ ఉషా బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.



సోమవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని వస్తున్న మంత్రులు కొల్లు రవీంద్ర, అచ్చెన్నాయుడు

వైభవంగా వైశాఖ పౌర్ణమి గరుడసేవ

తిరుమలలో సోమవారం వైశాఖ పౌర్ణమి గరుడ సేవ వైభవంగా జరిగింది. మలయప్పస్వామిని విశేషంగా అలంకరించారు. రాత్రి 7 గంటలకు ప్రియ వాహనుడు గరుడునిపై స్వామి కొలువుదీరి విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. భక్తులు విశేషంగా ఖ్యలో పాల్గొని మలయప్పస్వామిని దర్శించుకున్నారు. గ్యాలరీల్లోని భక్తుల గోవిందనామస్మరణలు, కర్పూర హారతుల వెలుగులతో మాడవీధులు శోభాయమానంగా దర్శనమిచ్చాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి




సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 16 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.40 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 80,423

తలనీలాలు సమర్పించినవారు: 29,361





దీవించమ్మా.. గంగమ్మ

ఇద్దరు కైకాల కులస్థులు సున్నపు కుండల వేషధారణతో గంగమ్మను దర్శించుకున్నారు. మిగిలిన భక్తులు చిత్ర, విచిత్ర వేషాలను ధరించారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి వేప చీరలు ధరించి కొందరు.. పొర్లు దండాలతో మరికొందరు గంగమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి







ఆస్తులు పంచేశాను

పిల్లలు చూడడం లేదు ● సబ్‌కలెక్టర్‌కి విన్నవించుకున్న విశ్రాంత పోలీసు



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అర్జీదారుడు

గూడూరు అర్బన్, మే 12 (ఆంధ్రజ్యోతి): 'నా భార్య చనిపోయింది. ఉన్న ఆస్తిని కుమారుడు, కుమార్తెకు పంచి పెట్టాను. వృద్ధాప్యంలో వాళ్లు నన్ను చూడటం లేదు' అని కోట మండలం విద్యానగర్‌కు చెందిన విశ్రాంత హెడ్ కానిస్టేబుల్ మస్తానయ్య ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వినతిపత్రం అందించారు. తనకు జీవనం ఇబ్బందికరంగా మారిందని, సీనియర్ సిటిజన్ యాక్ట్ ద్వారా న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 526 మంది గైర్హాజరు



ఎస్వీ జూనియర్ కళాశాలలో పరీక్ష రాసేందుకు వెళుతున్న విద్యార్థులు

తిరుపతి(విద్య), మే 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం మొదలైన ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలకు 526 మంది గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన ఫస్టియర్ పరీక్షలకు 7,427 మందికిగాను 448 మంది.. మధ్యాహ్నం జరిగిన సెకండియర్ పరీక్షలకు 848 మందికి గాను 78 మంది గైర్హాజరయ్యారు. తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

డిపో నిర్వహణ ఇలాగేనా..!

సిబ్బంది కొరతైతే ఓడీల్లో ఎందుకున్నారు? ● ఆర్టీసీ అధికారుల తీరుపై జోనల్ చైర్మన్ అసహనం

సూళ్లూరుపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): 'డిపో నిర్వహణ ఇలాగేనా? కార్యాలయ సిబ్బంది 11 గంటలైనా ఎందుకు రాలేదు? పరిసరాలు ఇలాగేనా ఉండేది? అధికారులు ఏం చేస్తున్నారు?' అంటూ ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నారెడ్డి సురేష్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. సూళ్లూరుపేట డిపోను సోమవారం తనిఖీ చేసిన ఆయన.. 11 గంటలైనా సిబ్బంది రాకపోవడాన్ని గుర్తించారు. ఉదయం 5 గంటలకు విధుకు హాజరుకావాల్సిన సూపర్‌వైజర్ రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్సు సర్వీసుల వివరాలను అక్కడున్న సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. డిపో నిర్వహణతో పాటు పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని, గత వైసీపీ సర్కారు ఆర్టీసీ ఆస్తులను సైతం తాకట్టు పెట్టి సంస్థను నిర్వీర్యం చేసిందని, దానిని సరిదిద్ది పూర్వవైభవం తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటే ఎలాగని ప్రశ్నించారు. డిపోలో తగినంత మంది సిబ్బంది లేనప్పుడు కండక్టర్లు, డ్రైవర్లను ఓడీల్లో ఎందుకు ఉంచుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన విజిలెన్స్ విచారణ నివేదిక తెప్పించుకొని డిపో నిర్వహణను గాడిలో పెట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆరణి విజయ భాస్కర్ రెడ్డి, తన్నీరు శేషగిరిరావు, తాటిపర్తి ఆదినారాయణరెడ్డి, విజయమ్మ పాల్గొన్నారు.



డిపోను పరిశీలిస్తున్న సురేష్‌రెడ్డి, బీజేపీ నాయకులు

పిడుగుపాటుకు యువకుడి బలి



మృతిచెందిన ఇరుదైనాథన్ డేవిడ్

తడ, మే 12 (ఆంధ్రజ్యోతి): తడ సున్నపుగుంట ప్రాంతానికి చెందిన ఇరుదైనాథన్ డేవిడ్ అలియాస్ చెందు(22) పిడుగుపాటుకు బలయ్యాడు. సోమవారం మధ్యాహ్నం పల్లిపాళెం వద్ద ఉన్న ఖాళీ ప్రదేశంలో స్నేహితులు భాను, విజయ్, వంశీ, గుణ, మరియదాసులతో కలిసి క్రికెట్ ఆడుతుండగా పిడుగుపడింది. ఇరుదైనాథన్ డేవిడ్ స్పృహ తప్పిపడిపోవడంతో వెంటనే శ్రీసిటీ ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు.

మేము సైతం

● ఇండియన్ ఆర్మీకి ఆటోమొబైల్ అసోసియేషన్ తరపున రూ.3.15లక్షలు



కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న తిరుపతి ఆటోమొబైల్ అసోసియేషన్

తిరుపతి(కలెక్టరేట్), మే 12(ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన భారత సైన్యానికి తిరుపతి ఆటోమొబైల్ అసోసియేషన్ తరపున రూ.3.15 లక్షల చెక్కును విరాళంగా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు అందజేశారు. కలెక్టరేట్‌లో సోమవారం హోండా మోటార్స్ పృథ్వీ ఇతర ఆటోమొబైల్ డీలర్లతో కలిసి కలెక్టర్‌కు చెక్కు అందజేశారు.

ఈ-సెంట్రల్ ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకురండి



అధికారులకు సూచనలిస్తున్న హెల్త్ కమిషనర్ వీరపాండ్యన్

తిరుపతి(వైద్యం), మే 12 (ఆంధ్రజ్యోతి): పేదలకు నాణ్యమైన వైద్య పరీక్షలు నిర్వహించేందుకు తిరుపతి రుయాస్పత్రిలో ఈ సెంట్రల్ ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండ్యన్ ఆదేశించారు. రుయాస్పత్రిని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మైక్రో బయాలజీ, బయో కెమిస్ట్రీ, పెథాలజీ, ఎంఆర్ఐ, రేడియాలజీ విభాగాలను పరిశీలించారు. తక్షణమే వైద్య పరీక్ష ఫలితాలను అందించేందుకు ఈ-సిటీ డయాగ్నోసిస్ సెంటర్‌ను అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. 24 గంటలు నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు ఈ సెంట్రల్ ల్యాబ్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. మందులు, వైద్య పరికరాల రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ ఎంసీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో శ్రీహరి, వైస్ ప్రిన్సిపాల్ డీఎస్ఎన్ మూర్తి, వైద్యులు మాధవీలత, శ్రీధర్ పాల్గొన్నారు.

అర్ధరాత్రి ప్రమాదం

● ఆటోను ఢీకొన్న టిప్పర్

● 8 మంది తమిళనాడువాసులకు తీవ్ర గాయాలు



గాయపడిన రవిచంద్రన్ - కుమారవేల్

శ్రీకాళహస్తి, మే 12 (ఆంధ్రజ్యోతి): బుచ్చినాయుడు కండ్రిగ మండలం పదో మైలు వద్ద సోమవారం అర్ధరాత్రి ఆటోను టిప్పర్ ఢీకొనడంతో 8 మందికి తీవ్ర.. ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. తమిళనాడు రాష్ట్రం పెరంబూరుకు చెందిన 11 మంది శ్రీకాళహస్తీశ్వరుడి దర్శనానికి సోమవారం బస్సులో వరదయ్యపాళేనికి వచ్చారు. అక్కడ్నుంచి ఆటోలో శ్రీకాళహస్తికి బయలుదేరారు. పదో మైలు వద్ద వీరి ఆటోను ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొంది. క్షతగాత్రులను స్థానికులు శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన ఎనిమిది మందిని తిరుపతి రుయాకు పంపించారు.

బి న్యూ మొబైల్ స్టోర్స్‌లో సమ్మర్ ఆఫర్లు

హైదరాబాద్, మే 12 : బీ న్యూ మొబైల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఈసారి సమ్మర్ స్పెషల్ ఆఫర్లతో మరింత ఆకర్షణీయంగా ముందుకొచ్చిందని బీ న్యూ మొబైల్స్ సీఈవో వై. సాయి నిఖిలేష్ తెలిపారు.10 సంవత్సరాలుగా వినియోగదారుల మద్దతును పొందిన తమ సంస్థ, తాజాగా తిరుపతి మరియు శ్రీకాకుళం పట్టణాల్లో స్టోర్లను ప్రారంభించిందని మీడియా సమావేశంలో ఆయన వివరించారు.కేవలం మొబైల్ ఫోన్లకే కాకుండా, గృహోపకరణాలపై కూడా సమ్మర్ ఆఫర్లను ఇస్తున్నామని తెలిపారు.ఎంఐ, వీవో, ఒప్పో, రియల్‌మి, ఐఫోన్, శాంసంగ్, నథింగ్, వన్ ప్లస్ మొబైల్స్‌పై ఖచ్చితమైన బహుమతులతో పాటు ల్యాప్‌టాప్‌లపై రూ.10,000 వరకూ, టీవీలపై 37,000 వరకూ క్యాష్ బ్యాక్ ఇస్తున్నామన్నారు.ఎంపిక చేసిన మొబైల్స్‌పై 50% వరకు డిస్కౌంట్, మొబైల్ యాక్సెసరీస్‌పై 85% వరకు డిస్కౌంట్, బజాజ్ ఫైనాన్స్ ద్వారా కొనుగోలుపై 35,000 వరకు క్యాష్ బ్యాక్ వుందన్నారు.జీరో డౌన్ పేమెంట్ + నో కాస్ట్ ఈఎంఐపై మొబైల్స్, టీవీలు, ల్యాప్‌టాప్‌లు, కూలర్లు, ఏసీలు,ఐఫోన్‌పై స్పెషల్ డిస్కౌంట్లు మరియు 35,000 వరకూ క్యాష్ బ్యాక్ వుందన్నారు. ప్రీమియం మొబైల్ కొనుగోలు చేస్తే, ఏసీ, కూలర్, సౌండ్‌బార్స్ స్మార్ట్ టీవీ ఉచితమన్నారు.ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వై. సాయి నితీష్ మాట్లాడుతూ, ఏసీలు మరియు ఎయిర్ కూలర్లు ఇప్పుడు బీ న్యూ స్టోర్లలో ప్రత్యేక సమ్మర్ ధరలతో అందుబాటులో ఉన్నాయన్నారు. పాన్ కార్డ్ మరియు ఆధార్ కార్డ్ సిబిల్ స్కోర్ అవసరం లేకుండా బజాజ్ ఫైనాన్స్ ద్వారా సులభంగా ఈ సమ్మర్ డీల్స్ పొందొచ్చని తెలియజేశారు.సీఎండీ వై.డి. బాలాజీ చౌదరి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లోని 150 షోరూంలలో ఈ ఆఫర్లు అందుబాటులో ఉన్నాయన్నారు.



టీచర్ల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం



కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శన చేస్తున్న యూటీఎఫ్ సంఘం ఉపాధ్యాయులు

తిరుపతి(విద్య) మే 12(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం తప్పదని యూటీఎఫ్ నాయకులు స్పష్టం చేశారు. బదిలీలు, పదోన్నతుల విషయంలో ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ సోమవారం ఐక్య ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డీజే రాజశేఖర్, ముత్యాలరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. గత ప్రభుత్వం జారీ చేసిన 117 జీవోను రద్దుచేసి కొత్త జీవో విడుదల చేసిన తర్వాత మాత్రమే పాఠశాలలను పునఃసమీక్షించాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 1:20 నిష్పత్తి ప్రకారం ఉపాధ్యాయులను నియమించాలని, ఐదు తరగతులు బోధించడానికి ఐదుగురు ఉపాధ్యాయులను ప్రాథమిక పాఠశాలల్లో నియమించాలని డిమాండ్ చేశారు. ఉర్దూ మీడియం బోధించే ఉపాధ్యాయులను తెలుగు మీడియం ఎస్జీటీ స్కూల్ అసిస్టెంట్లతో కలిపి లెక్కించి ఆ మేరకు పోస్టులు కేటాయించడం సరికాదన్నారు. ఇలా మొత్తం 13 డిమాండ్లను వివరిస్తూ తక్షణం వాటిని పరిష్కరించాలని కోరారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జిల్లా విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ రమణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు దండు రామచంద్రయ్య, సహాధ్యక్షులు కుమారస్వామి, గీతమ్మ, కోశాధికారి మోహన్‌బాబు, నాయకులు సూర్యప్రకాష్, జిల్లా కార్యదర్శులు బండి మధుసూదన్‌రెడ్డి, సురేష్, మస్తానయ్య, పద్మజ, హేమాంబరధరరావు, ఆదినారాయణ పాల్గొన్నారు.